సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

గురువారం । 7 । ఆగస్టు । 2025



'పట్టు' వదలని కార్మికులు..

దశాబ్దాలుగా కులవృత్తిని నమ్ముకుంటున్న నేత కార్మికులకు పూట గడవని పరిస్థితి. నేడు చేనేత దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం - 8లో ▸



భద్రతాప్రమాణాలు పాటించాలి

విద్యుత్ సిబ్బంది భద్రతా ప్రమాణాలు పాటించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి సూచించారు. - 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $33^0/25^0$

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

తాండేరో జోత్ తీజ్

గోధుమలు కట్టి.. కోరుకున్న వరుడి కోసం

- తొమ్మిది రోజులపాటు నిష్టతో కన్నె పిల్లల పూజలు
- గిరిజన తండాల్లో తీజ్ సంబురాలు



సాక్షి, మహబూబాబాద్ :

గిరిజన(లంబాడ) కన్నెపిల్లలు సంబురంగా జరుపుకునే పండుగ తీజ్. ఈ నెలలో పండుగను ప్రతీ గురువారం ఏదో ఒక తండాలో జరుపుకుంటారు. నేడు (గురువారం) ఉమ్మడిజిల్లాలోని పలు తండాలు తీజ్ పండుగకు ముస్తాబయ్యాయి. ప్రకృతి సిద్ధంగా శ్రావణంలో వర్షాలు కురవడంతో ఆకాశం నుంచి కిందికి వచ్చే ఎర్రని వర్ణం గల ఆరుద్ర పురుగులను కూడా తీజ్ అంటారు. ఆ అందమైన పురుగులు దేవుడు మనకోసం కిందికి పంపిస్తాడని, ఈ పురుగులు కనిపించినప్పుడు కన్నె పిల్లలు మనస్సులో కోరుకున్న కోరిక ఫలిస్తుందనేది గిరిజనుల నమ్మకం. మా తాండేరో జోత్ తీజ్ (తండాల్లో వెలుగు తీజ్) అంటూ పండుగకు సిద్ధమయ్యారు.

9 రోజుల తంతు..

- పెండ్లీడుకు వచ్చిన యువతి తనకు కావాల్సిన పెళ్లికొడుకు కోసం చేసే ఈ పండుగలో ముందుగా తల్లిదండ్రులు, తర్వాత పెద్దల ఆశీస్సులు తీసుకుంటారు. ముఖ్యంగా తండా పెద్ద నాయక్ అనుమతి పొందిన తర్వాత పండుగ తంతు మొదలుపెడతారు.
- తీజ్ (గోధుమ మొలకలు) ఏపుగా పెరిగేందుకు ఆడపిల్లలు అడవికి వెళ్లి దుస్సేరు (ఫిలోనీర్ వేళ్లీ) తెస్తారు. ఈ తీగలతో బుట్టలు అల్లుతారు.
- లంబాడీల ఆరాధ్య దైవం తుల్జా భవానీ, సేవాబాయి, సీత్లాభవానీలకు పూజలు చేసి స్నానాలు ఆచరించి పవిత్రతతో పుట్టమట్టిని తెస్తారు.
- ఏడో రోజు ఢమోళీ కార్యక్రమం నిర్వహిస్తారు. ఢమోళీ చుర్మో(రొట్టెలు, బెల్లం కలిపిన ముద్ద)ను మేరామా భవానికి నైవేద్యం పెడతారు.
- ఎనిమిదో రోజు మట్టితో బంజారా ఆరాధ్య దైవాల ప్రతిరూపాలను తయారు చేస్తారు. అబ్బాయి (డో్రా), అమ్మాయి(డో్రీ)లుగా పేర్లు పెడతారు. వీటిని గిరిజన సంప్రదాయాల ప్రకారం పెళ్లి చేస్తారు.
- తొమ్మిదో రోజున డప్పుచప్పుళ్లు, గిరిజన నృత్యాలతో అందరూ బుట్టల వద్దకు వెళ్తారు. తండా నాయక్ వచ్చి యువతులకు బుట్టలను ఇచ్చి ఆశీర్వాదం అందిస్తారు.



- లంబాడీ భాషలో బోరడీ ఝుష్కేరో అంటే రేగుముళ్లు గుచ్చడం. తీజ్ వేడుకల్లో భాగంగా నానబెట్టిన శనిగలకు యువతలు రేగుముళ్లు గుచ్చుతారు. బావ వరుస ఉన్న వారు కన్నెపిల్ల మనస్సు చెదిరేలా కదిలిస్తూ ఉంటారు. అప్పుడు రేగుముళ్లు శనిగలకు కాకుండా వారి చేతికి కూడా గుచ్చుకుంటాయి. దీనిని భరిస్తూ రేగుముళ్లు శనిగలకు గుచ్చడం ఈ తంతు ప్రత్యేకత.

సంప్రదాయ పాటలు

మొదటి రోజు : లాంబి లాంబియే లాంబడీ ఏకెరీయో... తోన కుణ బొరాయో తీజ్.. సేవాభాయ బొరాయో తీజ్.. (గునుగుపూల వలె ఎదుగుతవమ్మా.. నిను కొలిచే వారెవరమ్మా.. సేవాలాల్ మహరాజ్ అలికి కొలుస్తారమ్మా తీజ్..) అని పాడుతూ తొలిరోజు వేడుకలు జరుపుకుంటారు.

చివరి రోజు : తూ కతేతి ఆయోరే దుదియా తళావో.. మారో తీజేరో జోత్ లేయి చాలో.. డగేరే చాలో.. (ఎక్కడినుంచి వచ్చావో దుదియా చెరువు.. తొమ్మిది రోజులు పెంచుకున్న తీజ్ తండా వెలుగును తీసుకుని వెళ్తున్నావు) అంటూ పెళ్లికాని అమ్మాయిలు పాటలు పాడుతూ తీజ్ బుట్టలను చెరువులో నిమజ్జనం చేస్తారు.

ప్రకృతితో అనుబంధం



ప్రతీది ప్రకృతితో అనుబంధంగానే మా జీవన విధానం ఉంటుంది. మా పంటలు, కుటుంబాలతోపాటు, ఆడపిల్లకు సరైన వరుడిని కూడా ప్రకృతి అనుమతితోనే పొందాలన్నదే తీజ్ ఉద్దేశం. చిన్నతనంలో పండుగ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూసేవాళ్లం.. ఇప్పటికీ తీజ్ ఉత్సవాల్లో పాల్గొనడం అంటే భలే ఇష్టం.

\- భూక్య ఉమ, మహబూబాబాద్

అంతా మేరామా యాడీ దయ



మా కుల దేవతలు సేవాలాల్, మేరామా యాడీ(గౌరీ దేవి)కి పూజలు చేసి తీజ్ పండుగను ప్రారంభిస్తాం. అంతా అమ్మవారే చూసుకుంటారని నమ్మకం. అందుకోసం గోధుమలు తెచ్చి నిష్టతో తొమ్మిది రోజులు పూజలు చేస్తాం. యువతులు పాటలు పాడుతూ.. ఆటలు ఆడడం సరదాగా ఉంటుంది.

\- జాటోత్ రూప్సీ లక్ష్మి, గార్ల

న్యూస్‌రీల్

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి



హన్మకొండ అర్బన్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని హనుమకొండ జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, జడ్జి క్షమాదేశ్ పాండే అన్నారు. బుధవారం జులైవాడలో ప్రభుత్వ బాలిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రాంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు..బాలికలు చదువు, క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని, అందుకు తగినట్లుగా ప్రభుత్వం కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, సంక్షేమ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశాయని తెలిపారు. కార్యక్రమంలో ఆశా యూనిట్ మెంబర్ పి.శ్రీనివాస్, సీడబ్ల్యూసీ మెంబర్ దామోదర్, హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రేపు పాలిసెట్ స్పాట్ అడ్మిషన్లు

రామన్నపేట: టీజీ పాలిసెట్–2025 కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 8న(శుక్రవారం) స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, టీజీ పాలిసెట్ హెల్ప్‌లైన్ సెంటర్, వరంగల్ క్యాంప్ ఆఫీసర్ బైరి ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్పాట్ అడ్మిషన్లకు టీజీ పాలిసెట్-2025లో అర్హత పొందిన, పొందని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని సూచించారు. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్‌లో వివిధ కేటగిరీల్లో మిగిలి ఉన్న 28 సీట్లకు ఈ అడ్మిషన్లు ఉంటాయని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 8న ఉదయం 10 గంటల వరకు వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హాజరుకావాలని పేర్కొన్నారు. విద్యార్థులు వారి వెంట టీసీ, ఎస్సెస్సీ మెమో, స్టడీ, కుల సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు, టీజీ పాలిసెట్ -2025 ర్యాంక్ కార్డు, ఇతర అవసరమైన ధ్రువపత్రాలు తీసుకొని రావాలని కోరారు. వివరాలకు http://tgpolycet.nic.in వెబ్‌సైట్ సందర్శించాలని వివరించారు.

ఎంజీఎంకు వైద్య పరికరాల అందజేత



ఎంజీఎం : వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి నిత్యం వివిధ వ్యాధులతో బాధపడే పేద రోగులకు సేవలందించడం కోసం సుబేదారిలోని కాకతీయ హైస్కూల్‌కు చెందిన 1990 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఒక డీ – ఫీబ్రిలేటర్, 12 వీల్ చైర్లను బుధవారం ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, ఆర్యంల సమక్షంలో ఆర్ఎంఓకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు సత్యనారాయణరావు, విజయకుమార్, శ్రీనివాస్, చిట్టి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

స్టోన్ క్రషర్లపై మైనింగ్ కత్తి



రాయల్టీ, లీజు తదితర బకాయిదారులపై దృష్టి ● లీజు రద్దు చేసి టెండర్ల ద్వారా కేటాయించే యోచన

- ఆదాయం పెంచుకునే దిశగా ప్రభుత్వం కసరత్తు
- ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఏడు గ్రానైట్ క్వారీలు, క్రషర్లు
- ముగిసిన టెండర్ల ప్రక్రియ.. త్వరలో అర్హులకు కేటాయింపు

సాక్షిప్రతినిధి, వరంగల్:

గ్రానైట్ క్వారీలు, స్టోన్ క్రషర్ల అక్రమ దందాను అరికట్టేందుకు గనుల శాఖ సిద్ధమైంది. ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన రాయల్టీని రూ.లక్షల్లో కాజేస్తున్న నిర్వాహకులపై కొరడా ఝుళిపించేందుకు కసరత్తు చేస్తోంది. ఇదే సమయంలో గ్రానైట్ క్వారీలు, రోడ్, స్టోన్ మెటల్ (కంకర) క్రషర్ల ద్వారా ఆదాయాన్ని పెంపొందించుకునేందుకు గనులశాఖ దృష్టి సారించింది. ఇందుకు ప్రభుత్వ భూముల్లో గుట్టలు, మైనింగ్‌కు అనువైన స్థలాలను గుర్తించి టెండర్ ద్వారా లీజుకు ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. తొలి ప్రయత్నంగా రాష్ట్ర వ్యాప్తంగా 34 గ్రానైట్, స్టోన్ మెటల్ క్వారీలకు ప్రభుత్వం టెండర్లు పిలిచింది.

అక్రమాలకు ఇక అడ్డుకట్ట..

ఉమ్మడి వరంగల్‌లో సుమారు 360కి పైగా కంకర క్రషర్లు, 100కు పైగా గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. ఒక్క హనుమకొండ జిల్లాలోనే 29 బ్లాక్, 33 కలర్ గ్రానైట్, 64 స్టోన్ మెటల్, క్వార్ట్జ్, గ్రావెల్ క్వారీలు రెండు కలిపి 128 ఉన్నాయి. ఇందులో సగం వరకు రాజకీయ నాయకులు, వారి అనుచరులవే ఉన్నాయి. అనుమతి లేకుండా రాతి క్వారీలు నిర్వహిస్తున్నా, అనుమతి తీసుకుని నిబంధనలు ఉల్లంఘించి ఫ్రాడ్‌చేసినా రెండేళ్ల జైలు శిక్షతోపాటు రూ.ఐదు లక్షల జరిమానా విధించే చట్టాలు చుట్టాలుగా మారుతున్నాయి. కొన్నేళ్లుగా రూ.కోట్ల విలువ చేసే రాతి ఖనిజం కంకర, గ్రానైట్ రూపేణా దోపిడీకి గురైంది. తవ్వి తరలించిన దానికి.. ప్రభుత్వానికి రాయల్టీ కట్టే సమయంలో చూపించే లెక్కలకు పొంతన లేకపోగా.. 30 నుంచి 50 శాతం వరకే చెల్లించిన సందర్భాలు ఉన్నాయి. కొన్నిచోట్ల లీజు పరిమితి తీరినా.. ఇంకా గ్రానైట్, కంకర క్వారీలు నడుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. క్వారీల్లో పేలుడుకు సంబంధించి ఇష్టారాజ్యంగా జిలెటిన్‌స్టిక్స్‌ను సరైన భద్రతా చర్యలు లేకుండా తరలిస్తున్నారు. రవాణా సమయంలో భారీ కుదుపులు వచ్చినా, ఎదురుగా ఏదైనా వచ్చి వాహనాన్ని ఢీకొన్నా భారీ పేలుడు జరిగే ప్రమాదం ఉంటుంది. అధికారుల తనిఖీలు సక్రమంగా లేకపోవడంతో అక్రమార్కులు సరైన భద్రతా వ్యవస్థ లేకుండానే జిలెటిన్‌స్టిక్స్ తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వీటన్నింటిపై సమీక్షలు చేసిన గనులశాఖ ప్రత్యేక బృందాలను నియమించి క్వారీల వారీగా లీజు అగ్రిమెంట్లు పరిశీలిస్తూ లీజు, రాయల్టీ బకాయిల లెక్కలు తీస్తోంది.

మొదట ఏడు క్వారీలు..

ప్రభుత్వ స్థలాలు, గుట్టలను గుర్తించి గ్రానైట్, కంకర క్వారీలను టెండర్ల ద్వారా కేటాయించేందుకు శ్రీకారం చుట్టిన గనులశాఖ.. మొదట ఉమ్మడి జిల్లాలో ఏడు క్వారీల టెండర్లు ఈ నెల 12 ఖరారు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. హనుమకొండ జిల్లా ఊరుగొండలో రెండు స్టోన్ మెటల్, రెండు కలర్ గ్రానైట్ క్వారీలు, ఆత్మకూరు మండలం పెద్దాపూర్‌లో బ్లాక్ గ్రానైట్ క్వారీలు ఈ టెండర్లలో ఉన్నాయి. వరంగల్ జిల్లా సంగెం మండలం లోహితలో కంకర క్వారీ, జనగామ జిల్లా చిల్పూరు మండలం శ్రీపతిపల్లిలో ఒకటి, జఫర్‌గఢ్ మండలం హిమ్మత్‌నగర్‌లో ఒకటి చొప్పున రెండు క్వారీలకు టెండర్లు ఆహ్వానించారు. కాగా, గనుల శాఖ నోటిఫికేషన్ మేరకు జూలై 17న డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 6 వరకు టెండర్లు దాఖలు చేసే అవకాశం కల్పించారు. ఇదిలా ఉండగా.. ప్రభుత్వ భూముల్లో క్రషర్లు నడుపుతూ రాయల్టీ, లీజు డబ్బులు చెల్లించని 22 మందికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. అలాగే, కంకర, గ్రానైట్ కోసం తీసిన రాయికి రాయల్టీ కట్టని వారు.. గనులశాఖకు సూచించిన క్యూబిక్ మీటర్లను మించి రాయి తీసి తనిఖీల్లో దొరికి పెనాల్టీ చెల్లించని వారికి కూడా నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. 10–15 రోజుల్లో సదరు నిర్వాహకులు స్పందించకుంటే ఆ లీజులు సైతం రద్దు చేసి టెండర్లు పిలిచే అవకాశం ఉంటుందని మైనింగ్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

సమన్వయంతోనే బాలల సంరక్షణ

అడిషనల్ డీసీపీ రవి

వరంగల్ క్రైం: బాలల సంరక్షణ కోసం అన్ని శాఖలు సమన్వయంలో పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ (అడ్మిన్) ఎస్.రవి సూచించారు. నగరంలోని సుబేదారిలోని అసుంత భవన్‌లో ఆపరేషన్ ముస్కాన్ -11లో భాగంగా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్ అధ్యక్షతన ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ సంయుక్తంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రవి మాట్లాడారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా జూలైలో 177 మంది బాలలను రక్షించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మళ్లీ ఈ పిల్లలు బాల కార్మికులుగా మారకుండా వారికి ఎటువంటి పునరావాస కార్యక్రమాలను చేపట్టాలనే దానిపై అధికారులు ఆలోచించాలన్నారు. అనంతరం సిబ్బందికి ప్రశంసపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ, డీడబ్ల్యూఓ జయంతి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్ వినోద, కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి వెంకన్న, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వరంగల్, జనగామ చైర్ పర్సన్‌లు వసుధ, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.





పోచమ్మకు బోనాలు

కాజీపేట మండలం దర్గా శివారులో ఉన్న ఇందిరమ్మ కాలనీలో బుధవారం పోచమ్మకు భక్తులు బోనాలు సమర్పించారు.ఇందిరమ్మ కాలనీ అధ్యక్షుడు నారాయణగిరి శ్రీనాథ్ ఆధ్వర్యంలో కాలనీ మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించుకుని మొక్కుబడులు చెల్లించారు. - కాజీపేట

10న బాల్‌బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 10వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి మెన్ అండ్ ఉమెన్ బాల్‌బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బేరె వీరన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9గంటలకు హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని బాల్‌బ్యాడ్మింటన్ మైదానం వద్ద రిపోర్టు చేయాలని సూచించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో కూడిన ఉమ్మడి జిల్లా జట్టు ఈ నెల 23, 24వ తేదీల్లో కుమ్రంభీం జిల్లాలోని గోలేటీ టౌన్‌షిప్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.



జయశంకర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, కలెక్టర్ స్నేహ శబరీష్, కమిషనర్ బాజ్‌పాయ్, చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

స్వరాష్ట్ర సాధనకు పోరాడిన జయశంకర్

శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్

హన్మకొండ: తెలంగాణ స్వరాష్ట్ర సాధనకు అహర్నిశలు పోరాడిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. జయశంకర్ జయంతిని పురస్కరించుకుని హనుమకొండ బాలసముద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ స్మృతి వనంలోని జయశంకర్ విగ్రహానికి బండా ప్రకాశ్, హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, తెలంగాణ వాదులు, బీఆర్ఎస్ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బండా ప్రకాశ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి చనిపోయే వరకు తెలంగాణ కోసం పోరాడారన్నారు. భావ వ్యాప్తి ద్వారా ఉద్యమం ఉధృతంగా సాగిందన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టడంతోపాటు ఆయన పేరుతో జిల్లాను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో హనుమకొండ తహశీల్దార్ రవీందర్ రెడ్డి, జయశంకర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వరంగల్ కలెక్టరేట్‌లో..

న్యూశాయంపేట: వరంగల్ కలెక్టరేట్‌లో జయశంకర్ చిత్రపటానికి కలెక్టర్ డాక్టర్ సత్యశారద, జిల్లా అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీఆర్ఓ విజయలక్ష్మి, డీటీడబ్ల్యూఓ సౌజన్య, ఏఓ విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల వెబ్‌ఆప్షన్లు నిలిపివేత

విద్యారణ్యపురి: వరంగల్ పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ పరిధిలో స్కూల్‌అసిస్టెంట్లకు హెడ్మాస్టర్ల గ్రేడ్ 2 పదోన్నతులకు బుధవారం మధ్యాహ్నం 3–30గంటల ప్రాంతంలో వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభమైంది. సీనియారిటీ లిస్టులోని స్కూల్‌అసిస్టెంట్లు ఆప్షన్లు కూడా పెట్టుకుంటుండగా సాయంత్రం విద్యాశాఖ ఉన్నతాధికారులు వెబ్‌ఆప్షన్ల ప్రక్రియను నిలిపివేశారని సమాచారం. ఈమేరకు డీఈవోలకు కూడా సమాచారం అందింది. రాష్ట్రంలోని మల్టీజోన్–1, మల్టీజోన్–2 పరిధిలోని స్కూల్‌అసిస్టెంట్లకు పదోన్నతులకు వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ బుధవారం కొనసాగించాల్సి ఉండగా పలువురు సీనియారిటీ జాబితాల్లో తప్పిదాలపై తదితర కారణాలతో హైకోర్టును ఆశ్రయించటంతో కేసును ఈనెల 11వరకు వాయిదా వేసినట్లు తెలిసింది. దీంతో ఎస్ఏల హెడ్మాస్టర్ల గ్రేడ్ 2 పదోన్నతుల వెబ్‌ఆప్షన్ల ప్రక్రియను విద్యాశాఖ ఉన్నతాధికారులు నిలిపివేశారని సమాచారం. మల్టీజోన్–1 పరిధిలో 19 జిల్లాలు ఉండగా హెడ్మాస్టర్ల గ్రేడ్ 2 వేకెన్సీలు 492 ఉన్నాయి.

ఆర్టీసీ పండుగల ప్రత్యేకం

- వరలక్ష్మి వ్రతం, రాఖీ పౌర్ణమికి పెరగనున్న రద్దీ
- నేటి నుంచి ఐదు రోజుల పాటు ప్రత్యేక బస్సులు
- వరంగల్ రీజియన్‌లో9 డిపోల నుంచి హైదరాబాద్‌కు బస్సుల పెంపు



హన్మకొండ: వరలక్ష్మి వ్రతం, రాఖీ పౌర్ణమికి ప్రయాణికుల రద్దీ పెరగనుండడంతో టీజీఎస్ఆర్టీసీ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ప్రయాణికులను సురక్షితంగా, సుఖవంతంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు ఐదు రోజులు ప్రత్యేక బస్సులు నడపనుంది. ప్రయాణికులు ప్రైవేటు వాహనాల్లో వెళ్లకుండా నియంత్రించడంతో పాటు ఆర్టీసీకి ఆదాయాన్ని రాబట్టుకోవడం..సురక్షితంగా ప్రయాణికులను చేరవేసేందుకు పండుగల సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఈ నెల 8న వరలక్ష్మి వ్రతం, 9న రాఖీ పౌర్ణమి కావడంతో పాటు 10న ఆదివారం కావడంతో వరుసగా మూడు రోజులు సెలవులు వస్తున్నాయి. దీంతో వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న వారు సొంతూళ్లకు బయలుదేరుతారు. దీంతో ప్రయాణికుల రద్దీ పెరుగనుండడంతో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపేందుకు సిద్ధమైంది. ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడిపేలా అధికారులు కార్యాచరణ రూపొందించారు. హనుమకొండ బస్‌స్టేషన్, ఉప్పల్ పాయింట్‌లో ప్రయాణికుల రద్దీని పర్యవేక్షించడానికి, అవసరాన్ని బట్టి బస్సులు సమకూర్చడానికి 24 గంటలు అధికారులు, సిబ్బంది విధుల్లో ఉండేలా ప్లాన్ చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఉప్పల్ పాయింట్‌లో టెంట్లు, తాగునీటి సదుపాయం, పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టం ఏర్పాటు చేశారు. హనుమకొండ–హైదరాబాద్ ఉప్పల్ రూట్‌తో పాటు వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల పరిధిలోని బస్ స్టేషన్ల నుంచి వివిధ ప్రాంతాలకు ప్రయాణికుల రద్దీని అనుసరించి అదనపు బస్సులు నడిపేలా అధికారులు సమాయత్తమయ్యారు.

ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలు

ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యం. ఈ దిశగా వరలక్ష్మివ్రతం, రాఖీ పండుగల సందర్భంగా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, క్షేమంగా గమ్యస్థానాలకు చేరేందుకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. రీజియన్ పరిధిలోని సోదరసోదరీమణులంతా ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

–డి.విజయభాను, ఆర్టీసీ ఆర్ఎం

వరంగల్ జిల్లా తూనికలు, కొలతల అధికారిగా మనోహర్



కలెక్టర్‌కు పూలమొక్క అందిస్తున్న మనోహర్

న్యూశాయంపేట: వరంగల్ జిల్లా తూనికలు, కొలతల అధికారిగా కూచన మనోహర్‌ను ప్రభుత్వం నియమించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పనిచేస్తున్న మనోహర్‌ను పదోన్నతిపై జిల్లా తూనికలు, కొలతల అధికారిగా నియమించింది. మనోహర్ కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందించారు. ఇప్పటి వరకు ఇన్‌స్పెక్టర్ మహ్మద్‌అజీజ్‌పాషా ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు.

కుట్రలో భాగమే కాళేశ్వరంపై దుష్ప్రచారం

మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న వినయ్ భాస్కర్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి

హన్మకొండ: కుట్రలో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీ నాయకులు కాళేశ్వరంపై దుష్ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. దాశరథి నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటే.. కేసీఆర్ మన తెలంగాణ కోటి ఎకరాల మాగాణి అని రుజువు చేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్ర చేస్తుంటే మాజీ మంత్రి హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజలకు వాస్తవాలు వివరించారన్నారు. జస్టిస్ ఘోష్ కమిషన్ ఇచ్చింది నివేదిక మాత్రమేనని.. జడ్జిమెంట్ కాదన్నారు. కాళేశ్వరం మూడు పిల్లర్లు కుంగితే ప్రభుత్వ పెద్దదే బాధ్యత అయితే... సివిల్ సప్లై శాఖలో జరిగిన రూ.1100 కోట్ల కుంభకోణం జరిగిందని, దీనిని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ చేసినట్టేనా అని ప్రశ్నించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, చెన్నం మధు, సంకు నర్సింగరావు, జనార్దన్ గౌడ్, రజనీకాంత్, హరి రమాదేవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

● ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా



ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేస్తున్న పీఓ చిత్రామిశ్రా

ఏటూరునాగారం: నిరుద్యోగులు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఐటీడీఏ ద్వారా మెగా జాబ్‌మేళా నిర్వహించారు. జిల్లా నుంచి 357 మంది, ఇతర జిల్లాల నుంచి 21 మంది హాజరు కాగా 77 మందిని వివిధ కంపెనీలు ఎంపిక చేయగా వారికి పీఓ నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిరుద్యోగులు తమకు సరైన ఉద్యోగం లేదని కాలాన్ని వృథా చేయొద్దన్నారు. అందుబాటులో ఉన్న ఉద్యోగం చేస్తూ లక్ష్యం వైపు పయనించాలన్నారు. ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులు నిబద్ధతతో విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, డీడీ పోచం, ఏఓ రాజ్‌కుమార్, ఎస్‌ఓ సురేశ్‌బాబు, కిశోర్, ప్రభాకర్, శ్రీనివాస్, కొండల్‌రావు, భిక్షపతి, పాపారావు, సరస్వతి, ఏపీఎంలు, సీసీలు, వివిధ కంపెనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

9న పవిత్రోత్సవం

● శ్రీభద్రకాళి ఆలయంలో అంకురార్పణ పూజలు



హన్మకొండ కల్చరల్: ఈ నెల 9న శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీభద్రకాళి దేవాలయంలో అమ్మవారికి వైభవంగా పవిత్రోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆలయ ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు అంకురార్పణ పూజలు నిర్వహించారు. ఇందులోభాగంగా పావీరవికన్యా అనే మంత్రంతో హోమం నిర్వహించారు. మూడు రోజుల పాటు హోమం నిర్వహించిన ఈ హోమసంపాజిత్యాన్ని వివిధ రంగుల ఊలుదారాలతో రూపొందించిన దండలకు లేపనం చేస్తారు. ఊర్ధ్వసూత్రాల దండలను శాస్త్రోక్తంగా అమ్మవారిమూర్తికి, స్నపనమూర్తులకు అలంకరిస్తారు. వివిధ రంగుల ఊలు దారాలతో అలంకరించబడిన అమ్మవారు శోభాయమానంగా దర్శనమిస్తారు. దేవీ భాగవతంలో పేర్కొనబడినట్లుగా అమ్మవారికి పవిత్రోత్సవం ప్రీతికరమైనదని ఆలయంలో అర్చకుల వల్లగాని, భక్తుల వల్లగాని, అధికారుల వల్లగాని అపరాధాలు తొలగిపోవడానికే పవిత్రోత్సవాలు నిర్వహిస్తామని భద్రకాళి శేషు తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, రామేశ్వరరావు, మోత్కురి మయూరి తదితరులు పాల్గొన్నారు.

పట్టువదలని కార్మికులు ..

దశాబ్దాలుగా కులవృత్తిని నమ్ముకుంటున్న నేత కార్మికులు | నేడు జాతీయ చేనేత దినోత్సవం

● పోచంపల్లి తర్వాత పట్టు చీరకు నిలయం జనగామ
● ఇక్కడి నుంచి దేశ, విదేశాలకు ఎగుమతి
● బచ్చన్నపేటలో మొదలైన 'మగ్గం' చప్పుళ్లు





జనగామ జిల్లాలో తయారైన పట్టుచీరలు

జనగామ: పట్టు చీర.. మహిళలు అమితంగా ఇష్టపడే వస్త్రం. చూడడానికి హుందాగా, అందంగా కనిపించే చీర. వివాహాది, ఇతర శుభకార్యాల్లో కట్టుకోవడానికి మగువలు అత్యంత ఇష్టపడే చీర. అందుకే వస్త్ర ప్రపంచంలో పట్టుచీర మకుటం లేని మహారాణి. అయితే ఆ చీర తయారీ వెనుక నేత కార్మికుల కష్టం వెలకట్ట లేనిది. పట్టుదారం నుంచి రంగులు అద్దే వరకు చేతి వేళ్లనే ఆడిస్తూ అందమైన చీరను తయారు చేస్తున్నారు. యువకుల నుంచి వృద్ధుల వరకు ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో పట్టు చీరలకు స్వర్గధామమైన పోచంపల్లి తర్వాత జనగామకు ప్రత్యేక స్థానం ఉంది. నేతకార్మికులు రోజుకు వెయ్యి పట్టు చీరలు తయారు చేస్తూ ఇక్కడి నుంచి దేశ, విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అయితే 30 నుంచి 45 రోజుల్లో ఎనిమిది చీరలు నేసే నేత కార్మికులకు పావలా లాభం వస్తే, రిటైల్ మార్కెట్‌లో వ్యాపారులు వేల రూపాయలు అర్జిస్తున్నారు. ఫలితంగా నేత కార్మికులు మాత్రం ఇంకా పూటగడవని స్థితిలోనే జీవనం గడుపుతున్నారు. ప్రభుత్వాలు సాయం చేసినా, చేయకున్నా దశాబ్దాలుగా కులవృత్తినే నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో నేడు(గురువారం) జాతీయ చేనేత దినోత్సవం. ఈ సందర్భంగా జిల్లాలో నేత కార్మికుల వివరాలు, సొసైటీలు, మరమగ్గాలు, ప్రభుత్వం సాయం, తదితర అంశాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఉమ్మడి వరంగల్‌లో బచ్చన్నపేటలోనే మొదటి మగ్గం..

ఉమ్మడి వరంగల్ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రంలో 1970–71 సంవత్సరంలో మొట్టమొదటి మగ్గం ప్రారంభించారు. నేత కార్మికులు రెండు నెలల పాటు మగ్గం నేస్తూ ఎనిమిది చీరల(వార్పు)ను తయారు చేసేవారు. ఒక్కో చీరకు రూ.20 లాభం తీసుకుని రూ.120కి పోచంపల్లికి చెందిన హోల్‌సేల్ వ్యాపారులకు అమ్ముకునే వారు. అప్పటి వరకు వివిధ రంగాల్లో పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే కార్మికులు మగ్గం బాటపట్టారు. బచ్చన్నపేటలో మొదలైన పట్టుచీర తయారీ మండలంలోని అనేక గ్రామాలకు విస్తరించింది. ఏడాది తర్వాత జనగామలోని వీవర్స్ కాలనీ, లింగాలఘణపురం మండలం వడిచర్ల, కొత్తపల్లి తదితర మండలాల పరిధిలో మగ్గాలతో పట్టు చీరలు తయారు చేయడం మొదలు పెట్టారు.

జనగామ జిల్లాలో 11 సొసైటీలు..

అధికారిక లెక్కల ప్రకారం ప్రస్తుతం జనగామ జిల్లాలో 11 సొసైటీలుండగా, 3వేల మంది నేత, అనుబంధ కార్మికులు, 17 వందల మగ్గాలు, 450 పవర్ లూమ్స్ ఉన్నాయి. జిల్లాలో నెలవారీగా 15 నుంచి 17 వందల వరకు సెమికతాన్, రాజ్‌కోట్, పాట్లిపళ్ల, రాజ్‌కోట్‌పేటి, బార్డర్ సాదా, బార్డర్‌డిజైన్, కాటన్ తదితర డిజైన్లకు సంబంధించి పట్టు చీరలు తయారు చేస్తున్నారు. రూ.5,500 నుంచి రూ.13వేల వరకు హోల్‌సేల్ మార్కెట్‌కు సరఫరా చేస్తున్నారు.

రుణమాఫీకి నోచుకోని నేత కార్మికులు..

ప్రభుత్వం నేత కార్మికులకు రుణ సాయంతోపాటు నేతన్న పొదుపు, బీమా ద్వారా భరోసా కల్పిస్తోంది. జిల్లాలో రుణసాయం కోసం 679 మంది నేత కార్మికుల జాబితాతో జిల్లా కమిటీ అప్రూవల్ చేసి ప్రభుత్వానికి పంపించారు. కాగా, తెలంగాణ ప్రభుత్వం నేత కార్మికుల రుణమాఫీ హామీ నేటికీ అమలుకు నోచుకోవడం లేదు. అలాగే, చేనేత బంధు పథకం అమలు కూడా అదే పరిస్థితి నెలకొనడంతో కార్మికులకు ఎదురుచూస్తున్నారు.

జనగామ జిల్లాలో నేత కార్మికుడి ఇంట్లో, షోరూంలలో పట్టు చీరల ధరలు

	నేత కార్మికుడి ఇంట్లో	షోరూంలో..
సెమికతాన్	రూ.5,500	రూ.8,000
రాజ్‌కోట్	రూ.8,500	రూ.10,500
పాట్లిపళ్ల	రూ.9,000	రూ.14,000
రాజ్‌కోట్‌పేటి	రూ.9,000	రూ.16,000
బార్డర్ సాదా	రూ.5,000	రూ.7,000

మగ్గాన్నే నమ్ముకున్నాం..



పదిహేనేళ్లుగా మగ్గాన్నే నమ్ముకున్నాం. నెల రోజులకు ఒక వార్పు తయారు చేస్తా. పట్టు దారానికి రంగులద్దడం నుంచి మొదలు.. మగ్గంపై పట్టు చీర నేసే వరకు అన్ని పనులు చేసుకుంటా. నెలంతా కష్టపడితే రూ.15 నుంచి రూ.16 వేల వరకు సంపాదిస్తా.

ఏల యమున, వీవర్స్ కాలనీ, జనగామ

రెండున్నర దశాబ్దాలుగా కులవృత్తి చేస్తున్న..



రెండున్నర దశాబ్దాలుగా కులవృత్తిని నమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నా. పట్టుచీరల తయారీలో సుదీర్ఘ అనుభవం ఉంది. అచ్చు వేసిన తర్వాత, రంగులద్దిన పట్టుదారాన్ని తేడా రాకుండా, అచ్చులో ఒక్కొక్కటిగా అల్లాల్సి ఉంటుంది. ఒక్క దారం తేడా రాకుండా చకచకా వేసేస్తా.

బిర్రు రామకృష్ణ, వీవర్స్ కాలనీ, జనగామ

నేడు కార్మికులకు సన్మానం..



చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో ఉత్సవాలు నిర్వహిస్తాం. ప్రభుత్వ పథకాలు నేత కార్మికులకు వివరిస్తూ వారిని ప్రభుత్వం తరఫున సన్మానిస్తాం.

చాదేశ్వరి, చేనేత, జౌళిశాఖ అధికారి, జనగామ

లారీ, కారు ఢీ

● అక్కడికక్కడే ఒకరు దుర్మరణం
● భూపతిపేట సమీపంలో ఘటన



అశోక్‌కుమార్‌గౌడ్ (ఫైల్)



నుజ్జునుజ్జయిన కారులో అశోక్‌కుమార్‌గౌడ్ మృతదేహం

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం భూపతిపేట సమీప వైకుంఠ ధామం ఎదుట 365 జాతీయ రహదారిపై బుధవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. లారీ, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారు డ్రైవింగ్ చేస్తున్న ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఎస్సై బి. గిరిధర్‌రెడ్డి కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన ఐరన్ షాపు యజమాని బూర అశోక్‌కుమార్‌గౌడ్ (55) కారులో మహబూబాబాద్ నుంచి నర్సంపేటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గూడూరు మండలం భూపతిపేట సమీపంలోని వైకుంఠధామం వద్ద నర్సంపేట నుంచి గూడూరు వైపున వస్తున్న లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కారు సగభాగం నుజ్జునుజ్జయి అశోక్‌కుమార్ గౌడ్ అక్కడిక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న మృతుడి కుటుంబీకులు, బంధువులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని బోరున విలపించారు. ఎస్సై గిరిధర్‌రెడ్డి రెండు గంటల పాటు శ్రమించి కారు సగభాగం వేరు చేసి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

రైల్వే సమస్యలు పరిష్కరించాలి

● కేంద్ర మంత్రికి ఎంపీ, ఎమ్మెల్యేల వినతి



రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

కాజీపేట రూరల్ : న్యూఢిల్లీలో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్‌ను బుధవారం వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, కె.ఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, శాసనమండలి సభ్యుడు బస్వరాజు సారయ్య కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని రైల్వే సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కాజీపేట డివిజన్ ఏర్పాటు చేయాలని, కాజీపేట రైల్వే స్టేషన్ ఆవరణలో బస్‌స్టేషన్ నిర్మాణం కోసం స్థల సేకరణ, కాజీపేట అమృత్ భారత్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అనంతరం కాజీపేట బస్‌స్టేషన్ ఆవశ్యకతపై రైల్వే మంత్రికి వివరించి, ఇప్పటికే క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించారని, ప్రజారవాణా దృష్ట్యా బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలపై రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించి ఆ అంశాలను పరిశీలించి నివేదికలు పంపించాలని అధికారులకు చెప్పారని ఎమ్మెల్యేలు తెలిపారు.

విద్యుదాఘాతంతో మాజీ ఎంపీపీ మృతి



మల్లయ్య(ఫైల్)

దామెర: విద్యుదాఘాతంతో మాజీ ఎంపీపీ మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ రంగంపేటలో చోటుచేసుకుంది. హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండకు చెందిన జన్ను మల్లయ్య(55) ఆత్మకూరు ఎంపీపీగా రెండు పర్యాయాలు సేవలందించారు. ప్రస్తుతం వరంగల్‌లోని రంగంపేటలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున కరెంట్ మోటార్ ఆన్‌చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడికి భార్య మేనక, ఇద్దరు కుమారులు మహేశ్, ముఖేశ్, కూతురు మాధవి ఉన్నారు.

జ్వరంతో వ్యక్తి ..



నర్సింహారావు(ఫైల్)

వాజేడు: జ్వరంతో బాధపడుతూ ములుగు జిల్లా వాజేడు మండలం ముత్తారం కాలనీకి చెందిన కొండగొర్ల నర్సింహారావు(56) మంగళవారం రాత్రి మృతి చెందాడు. బంధువుల కథనం ప్రకారం.. నర్సింహారావుకు వారం క్రితం జ్వరం రాగా స్థానికంగా వైద్యం చేయించుకోగా తగ్గింది. మంగళవారం మళ్లీ రావడంతో ఏటూరునాగారంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు వెళ్లగా పరీక్షించిన వైద్యులు.. వరంగల్ వెళ్లాలని సూచించారు. వరంగల్ వెళ్లి ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆటోడ్రైవర్‌కు ఏడాది జైలు

వరంగల్ లీగల్ : నిర్లక్ష్యంగా ఆటో నడిపి ఒకరి మృతికి కారణమమైన డ్రైవర్ మరుపట్ల తారయ్యకు ఏడాది జైలు శిక్ష, రూ.1,500 జరిమానా విధిస్తూ హనుమకొండ మొదటి మున్సిఫ్ కోర్టు జడ్జి చింతాడ శ్రావణ స్వాతి బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2020, అక్టోబర్ 9న బీటెక్ విద్యార్థి బి.జశ్వంత్ బైక్‌పై హైదరాబాద్ నుంచి హనుమకొండ బయలుదేరాడు. మార్గమధ్యలో రాంపూర్ ఇండస్ట్రియల్ ఏరియా జంక్షన్‌లో మడికొండ నుంచి వస్తున్న ఆటో నిర్లక్ష్యంగా కుడి వైపునకు ఉన్న ఇండస్ట్రియల్ ఏరియా వైపుగా మళ్లించడంతో బైక్‌కు తగిలింది. దీంతో ఆటోలో ఉన్న ప్రయాణికులకు గాయాలు కాగా, బైక్ నడుపుతున్న బి.జశ్వంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108లో ఎంజీఎం తరలించారు. ఆటో డ్రైవర్ కాజీపేట రహమత్‌నగర్‌కు చెందిన మరుపట్ల తారయ్య అని తెలిసింది. అనంతరం జశ్వంత్ కుటుంబీకులు ఎంజీఎం వెళ్లేసరికి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మడికొండ పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువుకావడంతో జడ్జి శ్రావణ స్వాతి.. నేరస్తుడికి ఏడాది జైలు శిక్ష, రూ.1,500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కేసును పోలీస్ అధికారులు సీఐ కిషన్, ఎస్సై కుమారస్వామి, పరిశోధించగా లైజన్ ఆఫీసర్స్‌గా పరమేశ్వరి, కుమారస్వామి విచారణ పర్యవేక్షించారు. కానిస్టేబుల్ వీరగోని రాజేశ్, హోంగార్డు సదానందం సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

కుక్క అడ్డొచ్చి ఆటో బోల్తా..

● గురుకుల ఔట్‌సోర్సింగ్ టీచర్ మృతి
● డ్రైవర్‌తోపాటు మరో ఐదుగురికి గాయాలు



అజ్మీరీబేగం(ఫైల్)

న్యూశాయంపేట: వరంగల్ దూపకుంట రోడ్డులోని గిరిప్రసాద్ నగర్ వద్ద కుక్క అడ్డు రావడంతో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో బాలికల మైనారిటీ గురుకులంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో టీజీటీ ఉర్దూ టీచర్‌గా పనిచేస్తున్న అజ్మీరీబేగం(38) మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. దూపకుంట రోడ్డులోని మైనారిటీ బాలికల గురుకులంలో పనిచేస్తున్న ఐదు గురు మహిళా ఉపాధ్యాయులు బుధవారం పాఠశాల సమయం పూర్తికాగానే ఇంటికెళ్లడానికి ఆటో ఎక్కారు. వీరితో పాటు మరో మహిళ కూడా ప్రయాణిస్తోంది. ఈ క్రమంలో గిరిప్రసాద్‌నగర్ వద్దకు రాగానే కుక్క ఆటోకు అడ్డుగా వచ్చింది. దీంతో డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయగా బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్‌తోపాటు ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108లో ఎంజీఎం తరలించారు. కాగా, డ్రైవర్ పక్కన కూర్చున్న అజ్మీరీ బేగానికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆటో డ్రైవర్‌కు తీవ్ర, నలుగురు టీచర్లు, మరో మహిళకు స్వల్ప గాయాలు కాగా ఎంజీఎం, ఇతర ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదని మిల్స్‌కాలనీ పోలీసులు తెలిపారు.

కొడుకు హత్యకు గురయ్యాడని..

● మనస్తాపంతో తండ్రి మృతి
● మూడు చెక్కలపల్లిలో ఘటన



కోక్యా(ఫైల్)

నల్లబెల్లి: కొడుకు హత్యకు గురయ్యాడనే మనస్తాపంతో తండ్రి అనారోగ్యానికి గురై మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మూడు చెక్కలపల్లిలో జరిగింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బానోత్ కోక్యా (65), వాలి దంపతుల చిన్న కుమారుడు కొమ్మాలు అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండడంతో గత ఏప్రిల్ 12న హత్యకు గురయ్యాడు. అప్పటి నుంచి కోక్యా మనస్తాపానికి గురై ఆహారం మానేశాడు. దీంతో కొంతకాలంగా అనారోగ్యానికి గురవుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం కుటుంబ సభ్యులతో కుమారుడి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ మంచంలో ఒక్కసారిగా కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా మృతి చెందాడు.

సిబ్బంది భద్రతాప్రమాణాలు పాటించాలి

● ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: విద్యుత్ సిబ్బంది భద్రతాప్రమాణాలు పాటించాలని, ఈ దిశగా అధికారులు దృష్టి సారించాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి సూచించారు. బుధవారం హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈ, ఎస్ఏఓ, ఏఏఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో సీఎండీ మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలను పూర్తిగా తగ్గించాలన్నారు. ఈ దిశగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న లూజు లైన్లు, వంగిన పోల్స్, తుప్పు పట్టిన స్తంభాలు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలను, లైన్ క్రాసింగ్, డబుల్ ఫీడింగ్ స్తంభాలను గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. ప్రతీ వారం దీనిపై ఉన్నతాధికారులు సమీక్షిస్తూ పనులు పురోగతిలో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ నెలాఖరు వరకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించే లైన్ పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు టి.మధుసూదన్, సి.ప్రభాకర్, సి.ఈలు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, కె.తిరుమల్ రావు, రాజు చౌహాన్, అశోక్, వెంకట రమణ, ఆర్.చరణ్ దాస్, జీఎంలు వేణు బాబు, కృష్ణ మోహన్, వాసుదేవ్, సత్యనారాయణ, అన్నపూర్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రయోగాలతో సైన్స్‌బోధన

● జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామి



సులభతర విద్యా బోధన కృత్యాలు రూపొందిస్తున్న ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు

విద్యారణ్యపురి: విజ్ఞానశాస్త్ర విషయాలను ప్రయోగాత్మకంగా బోధించినప్పుడే విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరులు పెంపొందుతాయని హనుమకొండ జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామి తెలిపారు. బుధవారం హనుమకొండలోని లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని జిల్లా సైన్స్ కేంద్రంలో అమెరికన్ టెలిఫోన్ అండ్ టెలిగ్రాఫ్– ఏటీఅండ్‌టీ సంస్థ ఆధ్వర్యంలో అగస్త్య ఫౌండేషన్ వారి సౌజన్యంతో విద్యార్థులకు సులభంగా బోధించే విషయంపై జిల్లాలోని ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..భౌతికశాస్త్ర విషయాలను ప్రయోగాత్మకంగా సులభంగా బోధించేందుకు తక్కువ ఖర్చుతో రూపొందించిన కృత్యాలను ఉపాధ్యాయులచే చేయించారు. కార్యక్రమంలో భౌతికశాస్త్ర ఫోరం బాధ్యులు ఎ.జ్ఞానేశ్వర్, సత్యనారాయణ, అగస్త్య ఫౌండేషన్ ఏరియా మేనేజర్ చల్ల మౌనిక, విషయ నిపుణులు డి.వెంకట్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్‌లు మహేందర్, తిరుపతి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్య, ఆరోగ్యంతోనే ప్రజాశ్రేయస్సు

● హెచ్‌సీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ నర్సింహారెడ్డి



స్మారకోపన్యాసం చేస్తున్న హెచ్‌సీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ నర్సింహారెడ్డి

కేయూ క్యాంపస్ : అభివృద్ధి అంటే మౌలిక వసతులు, తలసరి ఆదాయం, స్థూల జాతీయ ఉత్పత్తియే కాదని, విద్య, ఆరోగ్య ద్వారానే ప్రజాశ్రేయస్సు సాధ్యమని, ఆ దిశగా రాష్ట్రాలు అడుగులు వేయాల్సిన అవసరం ఉందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)ఎకనామిక్స్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ డి. నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం కాకతీయ యూనివర్సిటీలోని సెనేట్‌హాల్‌లో డాక్టర్ జయశంకర్ స్మారకోపన్యాసం కార్యక్రమంలో 'డెవలప్‌మెంట్ డిపార్చర్స్ అండ్ ది ఫర్మార్మెన్స్ ఆఫ్ ది సోషల్ సెక్టార్ ఇన్‌ది సౌథర్న్ స్టేట్స్ ఆఫ్ ఇండియా' అనే అంశంపై మాట్లాడారు. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలంగాణ వివిధ రంగాల్లో వెనుకబాటులోనే ఉందన్నారు. విద్య, వైద్య శ్రేయస్సు ద్వారానే ఉత్పాదకత పెరుగుతుందన్నారు.బాలికలు, మహిళల్లో రక్తహీనత ఎక్కువ ఉందన్నారు.డాక్టర్ జయశంకర్ సామాజిక ప్రజాస్వామిక తెలంగాణను కలగన్నారన్నారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండాప్రకాశ్ మాట్లాడుతూ జయశంకర్ గొప్పమానవతావాది అన్నారు. తెలంగాణ స్వాప్నికుడు, విద్యావేత్త, దూరదృష్టిగల గొప్పవ్యక్తి అని కొనియాడారు. కేయూ విశ్రాంత కామర్స్ విభాగం ప్రొఫెసర్, మాజీ రిజిస్ట్రార్, జయశంకర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ ఎ. శంకరయ్య మాట్లాడుతూ జయశంకర్ గొప్పపరిపాలనాదక్షుడన్నారు. అనంతరం కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి. రామచంద్రం, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వల్లాల పృథ్వీరాజ్ మాట్లాడారు.

బీసీ రిజర్వేషన్లకు కేంద్రం చట్టం చేయాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కంచె ఐలయ్య

● ప్రొఫెసర్ కంచె ఐలయ్య

హన్మకొండ : బీసీ రిజర్వేషన్లకు కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకురావాలని ప్రొఫెసర్ కంచె ఐలయ్య డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ప్రజాయుద్ధ నౌక గద్దర్ ద్వితీయ వర్ధంతి జరిగింది. ఈ కార్యక్రమంలో కంచె ఐలయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గద్దర్ స్ఫూర్తిని ఈతరం కొనసాగించాలన్నారు. దేశ సాంస్కృతిక చరిత్రలో గద్దర్‌ది చెరగని స్థానమని, ఆయన జీవించి ఉన్నంత కాలం ప్రజల కోసమే పాటుపడ్డారన్నారు. తొలి రోజుల్లో బుల్లెట్‌ను నమ్ముకున్న గద్దర్.. తర్వాత అంబేడ్కర్ మార్గంలోకి వచ్చి బ్యాలెట్‌ని నమ్మారన్నారు. ప్రధాని మోదీ బీసీ అయినా తన వర్గానికి కాకుండా అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. ముస్లింలను చూపిస్తూ కేంద్ర మంత్రులు బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడడం సమంజసం కాదన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఎవరూ పోరాటం చేసిన స్వాగతిస్తామన్నారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ తెలంగాణ విముక్తి కోసం పాటుపడిన గద్దర్ కృషి మరువలేనిదన్నారు. గద్దర్ గళం ఫౌండర్ చైర్మన్ కొల్లూరి సత్తయ్య మాట్లాడుతూ వరంగల్‌తో పాటు ఉమ్మడి పది జిల్లా కేంద్రాల్లో గద్దర్ విగ్రహాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పసునూరి రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కన్నం సునీల్, మేడ రంజిత్ కుమార్, కాడపాక రాజేందర్, రామంచ శ్రీను, ప్రొఫెసర్ వీరస్వామి, ఆస్నాల శ్రీనివాస్, బండి మొగిలి, సాయిని నరేందర్, టి.ఎస్.స్వామి, మన్నె బాబురావు, రామంచ భరత్, తాళ్ల సునీల్ పాల్గొన్నారు.

రేపటినుంచి కేయూలో హాస్టళ్లు మూసివేత

● హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పీజీ విద్యార్థుల హాస్టళ్లు, కామన్‌మెస్, మహిళా హాస్టల్ మెస్‌ను రేపటి నుంచి మూసివేసి ఆయా విద్యార్థులకు ఈనెల 8 నుంచి 18వ తేదీ వరకు షార్ట్‌టర్మ్ సెలవులు ప్రకటిస్తున్నట్లు కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ఎల్.పి రాజ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ సెలవుల్లో వసతి గృహాల్లో మరమ్మతులు చేపట్టబోతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు తమ వస్తువులను తీసుకుని గదులు ఖాళీచేయాలని సర్క్యులర్ కూడా జారీచేశారు. ఈ విద్యాసంవత్సరానికి హాస్టల్ వసతి కోసం రెన్యూవల్ చేసుకోవాలన్నారు. అడ్మిషన్లకు రెన్యూవల్‌తో అనుసంధానిస్తున్నామన్నారు. నిర్దేశించిన విధంగా రెన్యూవల్ ఫీజు చెల్లించి వారికే హాస్టల్‌లో వసతి కల్పిస్తామన్నారు. వారికే మెస్ సౌకర్యం కూడా కల్పిస్తామని తెలిపారు. ఈనెల 15 నుంచి ఆన్‌లైన్‌లో రెన్యూవల్‌కు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

యథావిధిగా ఇంజనీరింగ్, 'లా' హాస్టల్ మెస్‌లు

కాకతీయ యూనివర్సిటీలో ఇంజనీరింగ్, 'లా' హాస్టళ్ల మెస్‌లు యథావిధిగా కొనసాగుతాయి. ఫార్మసీ విద్యార్థులకు కొందరికి పరీక్షలు ఉన్నాయని, ఆయా విద్యార్థులకు ఇంజనీరింగ్ హాస్టల్ మెస్ సదుపాయం కల్పిస్తామని హాస్టళ్ల డైరెక్టర్ ఎల్.పి రాజ్‌కుమార్ తెలిపారు.

కౌలురైతు ఆత్మహత్యకు కారణమైన వ్యక్తి అరెస్ట్

మంగపేట: మండలంలోని కమలాపురంలో కౌలు రైతు ఆత్మహత్యకు కారణమైన అదే గ్రామానికి చెందిన ఫర్టిలైజర్ వ్యాపారి వేమ సురేశ్‌ను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సూరి ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురానికి చెందిన రైతు పరమాత్ముల సమ్మయ్య ఈ నెల 4న ఫర్టిలైజర్ షాపు యజమాని సురేశ్ వేధింపులతో మనస్తాపం చెంది గడ్డి మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై మృతుడి భార్య కొమురమ్మ ఫిర్యాదు మేరకు సురేశ్‌ను అరెస్ట్ చేసి ములుగు కోర్టులో హాజరుపరిచి రిమాండ్ తరలించినట్లు ఎస్సై తెలిపారు.